# చక్రతీర్థ



**ప్రవాహవేగంతో మారిపోతున్న సమాజంలో తరాల అంతరం సృష్టించే సమస్యలు ఎలా ఉంటాయో బలివాడ కథ తెలియజెప్తుంది.**

శ్రీధర్ భువనేశ్వర్ విమానాశ్రయంలో దిగాడు. వెంటనే టాక్సీ తీసుకుని పూరీ బయలుదేరాడు. రోడ్డుకు అటూ ఇటూ లేచిన తోటల మధ్య పెద్ద పెద్ద హొటల్స్ చూసి దేశాన్ని ఇలా పురోగతికి కదల్చే చెయిన్‌లో తనూ ఒక లింక్‌గా ఉన్నందుకు గర్విస్తున్నాడు.

ఆహ్లాదపరచే కొత్తదనం చూసినప్పుడు ఒకనాటి పాత రోత ఊహలో తిరగటం సహజం కదా! పూరీ దగ్గర అవుతున్న కొద్దీ తన చిన్ననాటి పరిస్థితులు జ్ఞప్తికి వచ్చాయి. తన తండ్రి పూరీ పండా. భక్తుల్ని కళ్ళారా పీడించడం చూశాడు. ఆలయంలో భక్తులను ఒక చేత్తో బెత్తాంతో కొట్టి దీవిస్తూ, రెండో చేత్తో డబ్బు గుంజుకునేవాడు. గర్భగుడి స్తంభం దగ్గర పాపపరిహారానికి భక్తులచేత తల కొట్టమని చెప్పి, అలా చెయ్యనివాళ్ళ తలలు పట్టుకుని స్తంభానికి కొట్టి, రెండో చేత్తో డబ్బు ఇస్తావా ఛస్తావా? అని చెయ్యి చాపేవాడు. ఎవరైనా ఇవ్వకపోతే నోటి నుంచి ఎలాంటి దుర్భాషలు వచ్చేవో? ఆలయం చుట్టూ తిరిగే కొండముచ్చుల గుంపులు అరటిపళ్ళు, కొబ్బరిముక్కలు భక్తులు విసరితేనే అందుకునేవి. లేకపోతే వాటి మానాన అవి గెంతుతూ పరిగెత్తేవి. కానీ, ఈ పండా భక్తుల జేబులే కన్నం వేసేటట్టు మసలేవాడు. ఇదంతా వంటశాల దగ్గరలో శివమందిరం ఎదరగా ఉన్నమర్రిచెట్టు కింద నిల్చొని పక్కన క్లాసు పుస్తకాలు పడేసి చూస్తుండేవాడు.

క్లాసులో ఈ పండాను కొండముచ్చుకన్నా అసహ్యంగా చిత్రించాడు. కొడుకు చేత బలవంతంగా 'జగన్నాథ జనానా' కంఠస్థం చెయ్యిస్తున్నప్పుడే తనకు అనుమానం కలిగింది. వంశపారంపర్యంగా వచ్చే ఈ వృత్తిలో తనను ఇరికిస్తాడని తండ్రి మీద, ఈ పండా వృత్తి మీద అసహ్యమే అతనిలో పట్టుదలను చొప్పించింది. ఐ.ఏ.ఎస్.లో చేరగానే 'శ్రీధర్ పండా' పేరు 'శ్రీధర్'గా మార్చుకున్నాడు.

కారు తిన్నగా పూరీ హొటల్‌కు వెళ్ళింది. సామానులు పడేసి, స్నానం చేసి తయారయి ఆలయం దగ్గరలో తన తండ్రి ఉన్న 'చక్రతీర్థ' వీధికి వెళ్ళాడు. పూరీ సముద్రతీరం అంతా పెద్ద పెద్ద హొటల్స్‌తో ప్రపంచ యాత్రికులనే ఆకర్షించింది గానీ - ఈ సహవాసం వల్లనైనా ఈ వీధి మారలేదు. తన చిన్ననాట ఎలా ఉందో నేడూ అలాగే ఉంది. అంత చిన్న రోడ్డులో ఇటూ అటూ అడుక్కునే వాళ్ళ సంఖ్య పెరిగిపోయే ఉంది గానీ తరగలేదు. కుక్కలు విచ్చలవిడిగా గుంపులుగా తిరుగుతూ అరుస్తూ కాట్లాడుకుంటున్నాయి. అంత చిన్న రోడ్డుపైన రిక్షాలు ఒకదానికొకటి ఢీకొని నడుస్తున్నాయి. ఈగలు ముసిరి ఉన్న తీపి వస్తువుల దుకాణాలు అలాగే ఉన్నాయి. చిల్లర ఇచ్చే దుకాణాలూ మారలేదు. కోట్లాది భక్తులు దేవాలయం దర్శించి సముద్రతీరానికి వెళ్తారు. ఇలాంటి అతి ముఖ్యమైన వీధిలో ఏ మార్పూ లేదు. నలభై ఏళ్ళ స్వాతంత్ర్యం తరువాత తన తండ్రి సుదర్శన్ పండా ఇల్లూ అలాగే ఉంది. అతనూ అలాగే ఉన్నాడు. అతని కింద సేవచేస్తున్న శ్రీధర్ అక్క 'ముక్త' ఏ మార్పూ లేకుండా ఆ కిల్లీ నములుతూనే ఎదురైంది.

కొడుకును చూసి మంచం మీద ఉన్న సుదర్శన్ పండా ఎంతో బలం వచ్చినట్లు లేవబోయాడు. ఇంటినిండా ఈగలు ముసిరి ఉన్నాయి. పగలైనా గుడ్డి దీపం వెలుగు. తలవేపు గోడలో జగన్నాథుని పటం. ఉండీ ఉడిగీ చేతులెత్తి సుదర్శన్ పండా మొక్కుతూ "అంతా జగన్నాథుని లీల" అంటున్నాడు.

"ఏమైంది? వైద్యం చెయ్యిస్తున్నారు కదా! బాగుంది కదా - ఆమాత్రం దానికి టెలిగ్రాం ఎందుకిచ్చావ్? ఎంత సీరియస్ అనో ఢిల్లీనుంచి విమానంలో వచ్చాను" అన్నాడు ముక్తవైపు కోపంగా చూస్తూ.

"చాల గాబరా చేసిందిరా అందుకే టెలిగ్రాం ఇచ్చాను."

తల్లి చిన్నప్పుడే పోతే తనను పెంచిన పెద్దక్క ముక్త చొరవ చేసుకుని అంది.

"దానినెందుకు అంటావ్ - నేనే ఇమ్మన్నాను. సరే! వచ్చావు. మరి కోడలేదీ? నీతో రాలేదా?"

"నాకెన్ని సమస్యలున్నాయో_మీకేం తెలుసు? మీ దీనమైన పరిస్థితికి మీ కోడలే బాధ్యురాలని మీ అందరి అభిప్రాయం కదా! ఎందుకొస్తుంది? ఏ ముఖం పెట్టుకుని వస్తుంది?"

"నే నెప్పుడూ అలా అనలేదే. పోనీలే, నువ్వు వచ్చావు. అంతే చాలు. ముక్తా! తమ్ముడు నీచేతి భోజనం తిని ఎన్నాళ్ళయిందో?"

"అక్కర్లేదు. హొటల్లో దిగాను."

కాస్సేపు అంతా మౌనం.

"ఎప్పుడు తిరిగి వెళ్తున్నావ్?" అన్నాడు తండ్రి, ఆ పల్చని ఎముకలగూడు కదలిస్తూ.

"రేపు."

"ఈ రాత్రి ఒక గంట నాతో గడపగలవా?"

"దేనికి?"

"నాకో పని చేసి పెట్టాలి" అన్నాడు పిలకను ఒక చేతితో సవరించుకుంటూ.

"ఏం పని?"

"ఎవరో నీ హోదాను చూసి ఏదో అడిగే పని కాదు. నా సొంత విషయం మాటాడాలి."

"వస్తాను." వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి భోజనం చేసి వచ్చాడు. సుదర్శన్ పండా కొడుక్కోసం ఎదురు చూస్తూనే ఉన్నాడు.

"వచ్చావా? కూర్చో."

"అదిగో అక్కడ కలం, కాగితం ఉంచాను. నేను చెప్పినట్లు కాస్త రాసిపెట్టు..."

"ఏం - ఇంకెవరూ రాయలేరా?"

"నీ చేతి రాతలో ఉంటే చూసి సంతోషపడతానని...రాయి...రాయి...నీకు ఆలస్యం కాకూడదు."

శ్రీధర్ కాగితం, కలం తీశాడు. అది ఎవరికి రాస్తున్నదీ చెప్పలేదు.

"నేను చెప్పినట్లే రాస్తావు కదూ..." అంటూ సుదర్శన్ పండా చెప్పడం మొదలుపెట్టాడు. "ఈ సుదర్శన్ పండా ఎప్పుడూ ఏ రోజుకు ఆ రోజే ముఖ్యం అని బతికాడు. వీడు బతకనేర్చిన జాతిలో పుట్టాడు. బతకడానికి జగన్నాథుని ఆశ్రయం పొందాడు. ప్రేమించిన పిల్లల పెంపకానికి, పాపాలు చేస్తేగానీ గడవని రోజులు. తను పాపం చేస్తే, ఆ పాపం వలన ఉపకారం పొందిన వాళ్ళు పరిహారం చేస్తారన్న



చిత్రం: పి.ఎస్. బాబు

ధీమాలో పడ్డాడు. కొడుకు శ్రీధర్ పండాకు తెలును - ఈ కుడిచేతితో భక్తులను బెత్తాంతో కొట్టి తండ్రి పాపం కూడగట్టుకున్నాడని. అందుకే కుడి చెయ్యికి పక్షవాతం పట్టింది. ఈ పక్షవాతం రాగానే చప్పున గతం జ్ఞప్తికి వచ్చింది. ఇక అతనిలో అంత్యం సమీపిస్తున్నదన్న భావన కలిగింది.

"అతని జీవితమంతా జగన్నాథునిమయం. జగన్నాథ పురుషోత్తముని వంటశాలలో వండిన మహాప్రసాదం తినబట్టి కొడుకు శ్రీధర్‌కి అంత తెలివితేటలు వచ్చాయి. ఇక్కడి రంగు రంగుల ఉదయకిరణాలు శ్రీధర్ లేతచర్మానికి బలాన్ని ఇచ్చాయి. సంధ్యవేళ ఇసుక పరువుమీద అన్ని గంతులు వెయ్యబట్టి కదా వాడు తనలాగే ఎప్పుడూ చిర్రున చీదలేదు. ఈ పచ్చదనంలోని ప్రాణం, నీలి సముద్రపు హెూరు, ఈ కొబ్బరినీటి రుచి, సరుగుడుచెట్ల సరాగాలతో వీచిన గాలి పీల్చుతూ ప్రేమమయుడై, ఈ జగన్నాథుని లేక అతని బిడ్డలైన ప్రజలను - శ్రీధర్ సేవిస్తాడనుకున్నాడు. ఎన్ని రాజ్యాలు, ఎందరు రాజులు మారినా ఈ జగన్నాథుని ఆనవాయితీ మారలేదు. ఈ దేవాలయంలో పారంపర్యంగా వచ్చే పూజావిధులు నిల్పింది పండాలే! ఈ శక్తిని ఇచ్చింది జగన్నాథుడై నప్పుడు పండాల పాపాలను కడిగేవాడు ఆ దేవదేవుడే.."

ఇంకేదో చెప్తాడనుకుంటే, సుదర్శన్ పండా మౌనంగా సైగజేశాడు ఆ కాగితం, పెన్ను అక్కడ పెట్టేమని. కాస్సేపయ్యాక సుదర్శన్ పండా మెల్లగా ఆగి ఆగి అన్నాడు -

"ఈ ఏడు వైశాఖలో చందనయాత్ర చూడగలిగాను. జ్యేష్ఠ పున్నమి నాడు స్నానయాత్ర ఇంటినించే చూశాను. ఆషాఢంలో రథయాత్ర చూస్తానన్న నమ్మకం ఉంది. శ్రావణంలో ఝులన్ యాత్ర చూస్తానో లేనో చెప్పలేను. నాయనా! ఒక్కటి మాత్రం మరిచిపోకు. వర్గభేదాలు లేని వంటకొట్టు ప్రసాదం తిని పెరిగిన వాడివి. జగన్నాథుని దేశంలో మసలిన వాడివి. ఆలయంలో దేవుని రూపాలు మనిషి చెక్కినవి కావు. ఆ జగన్నాథుడు అనంత మహారాణాగా వచ్చి ఆ రూపాలిచ్చాడు. అందుకే అవి ఇన్నేళ్ళు, ఎన్నేళ్ళయినా ఎక్కడున్నా నిన్ను ఉత్తేజపరుస్తాయి. ఆ ఉత్తేజంతో ఎంత పైకి నువ్వు ఎదిగావన్నది కాదు ముఖ్యం. ఏం సాధించావన్నది ముఖ్యం. రాజే సేవకుడనని చీపురుకట్ట పట్టుకుని తుడిస్తేగానీ జగన్నాథుని రథచక్రాలిక్కడ కదలవు. వెళ్ళు - నాయనా - వెళ్ళు" అని ముఖం తిప్పేశాడు.

**"ఏం సాధించావన్నది ముఖ్యం. రాజే సేవకుడనని చీపురు కట్ట పట్టుకుని తుడిస్తే గానీ జగన్నాథుని రథ చక్రాలిక్కడ కదలవు. వెళ్ళు - నాయనా- వెళ్లు" అని ముఖం తిప్పేశాడు సుదర్శన్ పండా.**



శ్రీధర్ వెళ్ళిన నెల రోజులనాడు ఒక కవరు వచ్చింది. అది శ్రీధర్ భార్య అనుపమ పేర వచ్చింది. విప్పింది. చూస్తే తన భర్త చేతిరాతతోనే ఉంది...

"ఇది మీరు రాశారా?" అని ఉత్తరం చూపించింది.

"అవును...ఇంతవరకే నాచేత రాయించాడు. తరవాత రాసింది మా ముక్త అక్కయ్య చేతిరాతలా ఉంది. చదువు."

భర్త రాత ఉన్నంతవరకు లోన చదువుకుని ముక్త చేతి రాతలో ఉన్న మిగతా ఉత్తరం ఇలా పైకి చదవ నారంభించింది. భర్త వింటున్నాడు.

"ఈ సుదర్శన్ పండా ఇదివరకు ఏ జన్మలోనో బాణాపూర్ సుదర్శన్ పండా అయ్యుంటాడనుకునేవాడు. నీకు బాణాపూర్ సుదర్శన్ పండా చరిత్ర తెలియచెప్పాలికదా! నిరుపేద. ఆకలితో మండిపోతూ అన్నం ముందు కూర్చున్నప్పుడు ఆకలితో చచ్చిపోతున్న తనలాంటి ప్రాణికి ఆ అన్నమంతా ఇచ్చి బతికించాడు. జగన్నాథుడు మెచ్చి ఏది కోరితే అది ఇచ్చే ఒక తమలపాకును సుదర్శన్ పండాకు వరంగా ఇచ్చాడు. ఎంతో ఉత్సాహంతో గంతులేసి లోకం అంతా చాటాడు. పర్యవసానం - ఈ తమలపాకును ఎవరో దొంగిలించి, మామూలు తమలపాకును అక్కడ పెట్టేశారు. ఈ జన్మలో ఈ సుదర్శన్ పండాకూ అదే జరిగింది. జగన్నాథుడు లీలామానుషుడు. అన్నదాత. అతనిచ్చిన భోగం తిని, కొడుకు చేత తినిపించి అతని పేరు చెప్పుకుని ఆర్జించి, కొడుకును చదివించాడు. పెద్ద చేశాడు. ఈ కష్టాలు, భయాలు, ప్రయాసలు, పేదరికం అంతా ఒకే విశ్వాసంతో భరించాడు. ఆ తమలపాకు ప్రసాదించినది తనకే కాదు, తన చుట్టూ ఉన్న చక్రతీర్థ ప్రజలకూ పంచిపెట్టాననుకున్నాడు.

"ఆ జగన్నాథుడిచ్చిన తమలపాకు మరెవరో కాదు - శ్రీధర్ పండా - ఆ తమలపాకును దొంగిలించిందెవరు? ఆ దొంగిలించిన కలవారి కూతురికే ఈ స్వీయచరిత్రను అంకితం ఇస్తున్నాడు ఈ సుదర్శన్ పండా."

"మీ కుటుంబం వాళ్ళకి కక్కడానికి ఇంకేం మిగలనట్లుంది" అని కోడలు ఉత్తరం అక్కడే విసరేసి లోపలకు వెళ్ళి పరువుమీద పడిపోయింది.

శ్రీధర్ తన బాధ్యతల నిర్వహణలో ఆవేళ నించే మామూలుగా నిమగ్నుడైపోయాడు. రోజుకు కనీసం ఐదారు మీటింగులు, ఒక పార్టీ, ఏదో ఒక సమావేశంలో ఉపన్యాసం, సాంఘిక జీవితంలో అంతస్తు పెరగడానికి తగ్గ అన్నిటిలో పాల్గొంటున్నాడు. 'ఎవరు తనకు కాబోయే పెద్ద? అతని అభిరుచులెలా ఉంటాయి? ఎలా మసలుకుంటే తన హెూదా సాఫీగా సాగిపోతుంది?' ఇలాంటి ఆలోచనలు, ఆచరణలో శ్రీధర్ నలిగిపోతుంటే, శ్రీమతి శ్రీధర్ ఇంట్లోకన్నా వీధిలోనే గౌరవం పెంచుకుని భర్తకు అండదండలుగా నిల్చోడానికి, మహిళామండలి వగైరా కలిగినవాళ్ళ సాంఘిక వ్యవస్థకు మరింత పరిపుష్టి చేకూర్చి తను ఢిల్లీలో ఉంటేగానీ ఏదీ జరగదన్నట్లు ఒక వాతావరణం సృష్టించడానికి ప్రయత్నిస్తోంది. ఒక సర్కిల్ అంటారే అది ఆమె సృష్టిస్తే, ఆ సర్కిల్‌లో ఇచ్చిపుచ్చుకోడాలన్న బార్డర్ డీల్స్ సాగిపోతున్నాయి. ఈ సర్కిల్‌లో పడితే, ఎంత కొరకరాని సమస్య అయినా ఇట్టే పరిష్కారం అయిపోతుంది. ఒక చిన్న మాట వెయ్యవలసిన చెవిలో పడితే, ఒక పెద్ద పని సునాయాసంగా అయిపోతోంది.

ఈ ఖుషీలో ఉండగా ఇంకో ఉత్తరం పూరీ నుంచి వచ్చింది. అది శ్రీధర్ పండా పేరులోనే వచ్చింది. ఆ కవరు ఉత్తరం రాసింది పండాల ప్రధాని గోపాల్‌చంద్ర పండా. విప్పి చదివాడు.

"శ్రీధర్ పండాకు దీవించి రాయునది -

మీ నాన్నగారు సుదర్శన్ పండా దైవసాన్నిధ్యం చేరుకుని ఈనాటికి సరిగ్గా పదిహేను రోజులైంది. అతని కోరిక ప్రకారం అతని చావును మీకు తెలియజేయలేదు. అతను దాచుకున్న డబ్బుతోనే అతని దహన సంస్కారాలను అతని కోరిక ప్రకారం మా పండాలం అంతా కలిసి చేశాం. అతను బతికుండగా ఎంత నచ్చచెప్పినా వినలేదు. కారణం అడిగాను. 'మంచం మీద ఉన్న నన్ను చూడడానికి రాగానే తండ్రి వీడికి గుర్తున్నాడని సరదాపడ్డాను. వచ్చినవాడు నా ఇంట్లో దిగలేదు. కనీసం తినమన్నా తినలేదు. ఆ క్షణంలోనే నాకు కొడుకు లేడని అనుకున్నాను' అన్నాడు. నువ్వు కొడుకుగా నీ బాధ్యతను మరచావు. చక్రతీర్థలో పుట్టి పెరిగి, అంత అధికారం చేపట్టి ఆ వీధినే అసహ్యించుకున్నావు.

చక్రతీర్థలో పుట్టి పెరిగిన మేము మా సహచరుని అంత్యక్రియలు అన్నీ సవ్యంగా జరిపించాం. ఈ విషయం కనీసం ఇప్పటికైనా తెలియజెప్పడం మా బాధ్యత అని నిర్ణయం తీసుకుని నీకీ ఉత్తరం రాస్తున్నాను."

ఉత్తరం చదివి ఒక్కసారిగా నెత్తి కొట్టుకుంటూ

"శ్రీధర్ పండా - వాట్ షేమ్ - వాట్ షేమ్ - " అని బిగ్గరగా అరిచాడు. ■